క్లుప్తంగా

మహానందీశ్వరుడి సన్నిధిలో జిల్లా న్యాయమూర్తి



న్యాయమూర్తి అమ్మణ్ణరాజుకు మెమెుంటో అందిస్తున్న సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో జిల్లా న్యాయమూర్తి అమ్మణ్ణరాజు బుధవారం మహానందికి వచ్చారు. మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య స్వాగతం పలికారు. ఆయన కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని న్యాయమూర్తికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష వాయిదా

పగిద్యాల: ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఈనెల 20న నిర్వహించనున్న పరీక్షను ఈనెల 21కి వాయిదా వేసినట్లు పగిద్యాల, బండిఆత్మకూరు ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాళ్లు వెంకటేశ్వర్లు, అబ్దుల్ రఫీ బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 20న ఈస్టర్ ఉన్నందున విద్యాశాఖ పాఠశాల కమిషనరేట్ ఆదేశాల మేరకు వాయిదా వేశామని, విద్యార్థులు గమనించాలని వారు సూచించారు.

సోలార్ ప్రాజెక్టుకు స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

పాములపాడు: మండలంలోని బానుముక్కల గ్రామ పొలిమేరలోని భూముల్లో సోలార్ ప్రాజెక్టు నిర్మాణానికి డీఈ టెక్నికల్ నంద్యాల్య నాగేశ్వరరావు, డీఈఈ రామసుబ్రహ్మణ్యం బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సోలార్ ప్రాజెక్టు నిర్మాణానికి వృథాగా ఉన్న భూములు కావాలని తహసీల్దార్ కార్యాలయానికి అర్జీ పెట్టామన్నారు. భానుముక్కల గ్రామంలోని సర్వే నంబరు 408లో 180 ఎకరాలున్నట్లు సమాచారం ఇవ్వడంతో పరిశీలిస్తున్నామన్నారు. ఇదే పొలం తెలుగుగంగ ప్రాజెక్టుకు మట్టి కోసం గతంలో కొనుగోలు చేసినట్లు తెలిసిందని, ప్రస్తుతం ఇరిగేషన్ శాఖ ఆధీనంలో ఉన్నందన్నారు. ఇరిగేషన్ శాఖకు జిల్లా కలెక్టర్ ద్వారా లెటర్ పంపి, తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ ఆర్.జయశేఖర్

కొత్తపల్లి: ఎస్‌ఐగా ఆర్ జయశేఖర్ బుధవారం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఆదోని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న జయశేఖర్‌ను సాధారణ బదిలీల్లో భాగంగా కొత్తపల్లికి ఉన్నతాధికారులు బదిలీ చేయడతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే అల్లర్లు, గొడవలకు, ఘర్షణలకు దిగకుండా పోలీసులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ప్రశాంతంగా జీవనం సాగించాలన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నందికొట్కూరు: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు జరుగుతాయని మిడుతూరు సీహెచ్‌సీ డాక్టర్ తిరుపతి, కడుమూరు డాక్టర్ యోమకేసు అన్నారు. బుధవారం మిడుతూరు, కడుమూరు సీహెచ్‌సీలలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాతృ మరణాలు, శిశు మరణాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు చేయడంతోనే ప్రసవ సమయంలో అనేక ఇబ్బందులు వస్తున్నాయన్నారు. మహిళ గర్భం ధరించినప్పటి నుంచి బిడ్డ పుట్టి ఐదేళ్లు పూర్తయ్యే వరకు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వరలక్ష్మి, రేణుకాదేవి పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

కొత్తపల్లి: గువ్వలకుంట్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో పబ్లిక్ పైపులైన్ లీకేజీ అయింది. విషయాన్ని కాలనీ వాసులు పంచాయతీ కార్యదర్శి చాందినీ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె బుధవారం స్వచ్ఛభారత్ కార్మికులు, వాటర్‌మేన్‌లతో మరమ్మతులు చేయించారు.

దేవస్థాన వైద్యశాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

- కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు



వైద్యులు, సిబ్బందితో సమావేశమైన దేవస్థాన ఈఓ శ్రీనివాసరావు

శ్రీశైలంటెంపుల్: దేవస్థాన వైద్యశాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. బుధవారం దేవస్థాన వైద్యశాలను పరిశీలించి, వైద్య విభాగం సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రోజువారీగా వచ్చే ఓ.పీ, దేవస్థానం చేపడుతున్న వైద్యపరీక్షలు, అందుబాటులో ఉన్న వైద్యపరికరాలు, రోజువారీగా వైద్యశాలలో అందజేస్తున్న ఔషధాలు, దేవస్థానం వైద్యశాలలో అందిస్తున్న ఔషధాలు, అత్యవసర వైద్యసేవలు మొదలైన వాటిని సమీక్షించారు. రోజుకు సగటున 250 మంది వైద్యసేవలు పొందుతున్నారని, రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యశాలలో ఔషధాలను అందుబాటులో ఉంచుకోవాలని ఈఓ సూచించారు. గుండెజబ్బు, పాము, తేలుకాటు తదితర వ్యాధులకు మందులు అందుబాటులో ఉండాలన్నారు. అవసరమైన ఆయా ఔషధాల జాబితాను సంబంధిత అధికారులకు అందజేయాలని వైద్యులకు సూచించారు. ఏ సమయంలోనైనా అత్యవసర వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉండాలని వైద్యులకు, సిబ్బందికి సూచించారు. ప్రాణాపాయస్థితిలో ఉన్నవారిని ఎటువంటి ఆలస్యం లేకుండా తక్షణ వైద్యాన్ని అందించేందుకు సిబ్బంది నిరంతరం సిద్ధంగా ఉండాలన్నారు. మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు పంపేందుకు అంబులెన్స్ అందుబాటులో ఉండాలన్నారు. వైద్యశాలలో తగినన్ని ఆక్సిజన్ సిలిండర్లు ఉంచుకోవాలన్నారు. రక్తపరీక్షలను మరింత అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరికరానికి అవసరమైన మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వైద్యశాలలో పారిశుద్ధ్యం, ఎలక్ట్రికల్ వైరింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వైద్యశాల నిర్వహణకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించి ఏపీ, ఔషధాల స్టాక్ నమోదు, స్టాక్ వినియోగం, వైద్యశాల రికార్డుల నిర్వహణ మొదలైనవన్నీ అందులో నమోదు చేయాలన్నారు. పరిశీలనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.నరసింహారెడ్డి, పీఆర్వో టీ.శ్రీనివాసరావు, అపోలో వైద్యులు పవన్, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలి



ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

ఆత్మకూరు: మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఒప్పందాల అమలుకు జీఓ జారీ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నాగన్న, పెద్దనాగరాజు, తిమ్మయ్య, సువర్ణమ్మలు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి మున్సిపల్ అధికారులు ఓబులేష్, నాయక్‌లకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలన్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. మున్సిపాలిటీలో 2016 నుంచి పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ కార్మికుల అకౌంట్‌లో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు గొడుగు రాజు, జోసెఫ్, జయన్న, నాగన్న, సురేష్, వినోద్, రాజేష్, సుశీలమ్మ, దేవమ్మ, మరియమ్మ, మన్నెమ్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే జయసూర్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా: ప్రజల సమస్యలు పరిష్కరించటంలో అధికారులు శ్రద్ధవహించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రజావినతుల పరిష్కారవేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ, ఏఓ కృష్ణారెడ్డి, ఏఈలు బషీర్, నాగేంద్ర, ట్రాన్స్‌కో ఏడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

20న నిరసన



డీఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న ముస్లిం మత పెద్దలు

ఆత్మకూరు: వక్ఫ్ సంరక్షణ–రాజ్యాంగ పరిరక్షణ పేరుతో ఈనెల 20న ఆత్మకూరులో చేపట్టనున్న శాంతియుత నిరసన ర్యాలీకి అనుమతి ఇవ్వాలని ముస్లిం మత పెద్దలు బుధవారం డీఎస్పీ రామాంజినాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉదయం 10 గంటలకు కొత్తపేట మసీదు నుంచి ర్యాలీ ప్రారంభించి నంద్యాల టర్నింగ్ మీదుగా గౌడ్ సెంటర్ చేరుకుని.. అక్కడ సభలో వక్తలు మాట్లాడతారని, అనంతరం బస్టాండు మీదుగా తహసీల్దార్ కార్యాలయం, అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని ర్యాలీని ముగిస్తామని డీఎస్పీకి విన్నవించారు.

అలరించిన గాత్ర కచేరి



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై యు.వి.ఎస్.కిరణ్, బృందం వారి టీత్రకచేరి ఆకట్టుకుంది. సిద్ధివినాయకం, శంభోశంకరా, భో శంభో, నాదతాండవం శంకరం, దేవ దేవం భజే, కాలభైరవాష్టకం, నమోస్తు వాణి, బ్రహ్మ మురారి, నమశ్శివాయ నటేశ్వరాయ తదితర గీతాలను, అష్టకాలను యు.వి.ఎస్.ఎస్.కిరణ్ ఆలపించారు. హార్మోనియం నవీన్‌కుమార్, తబలా సహకారాన్ని శివ అందించారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించండి

నంద్యాల: రాష్ట్ర ప్రభుత్వం మనమిత్ర పేరుతో తీసుకొచ్చిన వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి బుధవారం అధికారులకు ఒక ప్రకటనలో ఆదేశించారు. సేవల కోసం అధికారిక వాట్సాప్ నంబర్ 9552300009 ప్రభుత్వం కేటాయించిందన్నారు. ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 254కి పైగా సేవలు అందిస్తుందన్నారు. జూన్ నెలకు 500కు పైగా సేవలందించాలనే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సేవలను ప్రజలు వినియోగించుకునేలా సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు.

జగనన్న కాలనీ వద్ద ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్



రిక్వెస్ట్ స్టాప్ బోర్డును ఏర్పాటు చేసుకున్న జగనన్న కాలనీ వాసులు

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామ పంచాయతీలోని జగనన్న కాలనీ వద్ద ఏపీఎస్ ఆర్టీసీ రిక్వెస్ట్ బస్ స్టాప్‌ను బుధవారం ప్రజలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి స్వామన్న మాట్లాడుతూ కాలనీ వద్ద బస్సులు నిలపకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయంపై వారం క్రితం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు అర్జీ ఇచ్చామన్నారు. ఆయన ఆర్‌ఎం, ఆత్మకూరు డీఎంలకు సమస్య పరిష్కరించాలని ఆదేశాలిచ్చారన్నారు. డీఎం కాలనీని పరిశీలించి ఆయన సూచనలతో కాలనీ వాసులు రిక్వెస్ట్ స్టాప్ బోర్డు ఏర్పాటు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు శ్రీనివాసులు గౌడు, కాలనీ వాసులు సుశీలమ్మ, రవిగౌడు, వెంకటేశ్వర్లు, రజియా, శివ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనివ్వొద్దు



ఆర్‌ఓ ప్లాంటును ప్రారంభిస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

జూపాడుబంగ్లా: నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తనివ్వొద్దని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అధికారులకు సూచించారు. మండలంలోని తర్తూరు గ్రామంలో రూ.5 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంటును బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం తర్తూరు లక్ష్మీరంగనాథస్వామివారిని దర్శించుకుని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీకి ఆలయ ఈఓ సాయికుమార్ స్వామివారి పూలమాలను అందించి సత్కరించారు.

భక్తురాలికి పర్సు అప్పగింత



పర్సు అందిస్తున్న దృశ్యం

మహానంది: బెంగళూరుకు చెందిన ఆదిలక్ష్మి బుధవారం మహానందీశ్వరస్వామి దర్శనానికి వచ్చారు. స్వామివారి దర్శనం అనంతరం ఉత్తరద్వార గోపురం నుంచి వెళ్లే క్రమంలో రాహుకేతు మండపం వద్ద తన పర్సును మరిచిపోయి వెళ్లారు. రామాలయం ముఖ్య అర్చకుడు వనిపెంట ప్రకాశం శర్మ పర్సును గుర్తించి టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్యకు అందించి మైకుల్లో అనౌన్స్ చేయించి బాధితురాలిని రప్పించి పర్సు, అందులో ఉన్న రూ.10,700 నగదును అందించారు. ముఖ్యఅర్చకుడికి బాధితురాలు కృతజ్ఞతలు తెలిపారు.

మహానందీశ్వరుడిని దర్శించుకున్న బీసీ ఫెడరేషన్ చైర్మన్

మహానంది: ఏపీ బీసీ ఫెడరేషన్ చైర్మన్ తమ్మిశెట్టి చక్రవర్తి బుధవారం మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఆలయన ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య స్వాగతం పలకగా స్వామి, అమ్మవారిని దర్శించుకుని అభిషేకం, అర్చన పూజలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని, పాలకమండలిలో బీసీలకు చోటు కల్పించాలని, బీసీల జనగణన కార్యక్రమం చేపట్టాలని, బీసీల అభివృద్ధికి రూ.500 కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వేదపండితులు చైర్మన్ చక్రవర్తికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

జూదరుల అరెస్ట్

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని నూర్‌షావలి దర్గా సమీపంలో కుందూనది ఒడ్డున బుధవారం పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి వారి వద్ద నుంచి రూ. 15,100 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు



నవధాన్యాల కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను సాగుచేసుకోవచ్చునని ఏఈఓ నాగశ్రీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని శివపురం గ్రామంలో రైతులకు నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నవధాన్యాల సాగులో పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల తయారీపై అవగాహన కల్పించారు. ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి రకాల విత్తనాలను కలిపి ఒక ఎకరానికి 8 కేజీల నవధాన్యాల కిట్లను తయారు చేశామన్నారు. ప్రతి రైతు వారి పొలాల్లో నవధాన్యాలను సాగుచేసుకొని భూసారాన్ని పెంచుకోవాలన్నారు. అనంతరం మహిళా సంఘం సభ్యులకు నవధాన్యాల కిట్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎన్ఎఫ్ఏ నాగరాజు, మోడల్ ట్రైనీ సయ్యద్ బాషా, యూనిట్ ఇన్‌చార్జ్ రాజు నాయక్, రైతులు పాల్గొన్నారు.

మాన్యం భూముల వేలంపాట వాయిదా



వేలం పాటలో పాల్గొనేందుకు అధికారులకు డిపాజిట్లు చెల్లిస్తున్న రైతులు

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలో ఆలయం మాన్యం భూముల వేలం పాటలను వాయిదా వేస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి వెంకటరమణ తెలిపారు. బుధవారం వేలం పాటలు నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. గ్రామంలో ఈశ్వర స్వామి దేవస్థానానికి 21.33 ఎకరాలు, ఎల్లమ్మ దేవస్థానం భూములు 39.27 ఎకరాలు, కేశవ, రామచంద్ర, ఆంజనేయ స్వామి దేవస్థానం భూములు 43.22 ఎకరాల చొప్పున మొత్తం 103.82 ఎకరాల విస్తీర్ణంలో భూములున్నాయి. వేలం పాటలో పాల్గొనేందుకు 34 మంది రైతులు డిపాజిట్లు చెల్లించారు. కాగా గ్రామంలో సీతా రాముల దేవాలయం నిర్మాణం అసంపూర్తిగా ఉందని, నిర్మాణానికి వేలం పాటల నుంచి వచ్చిన డబ్బు ఇవ్వాలని గ్రామస్తు కోరారు. అందుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వస్తే డబ్బు కేటాయించేందుకు తమకు అధికారం ఉంటుందని ఈఓ పేర్కొన్నారు. ఈ విషయంపై గ్రామస్తుల్లో కొందరు వేలం పాటలు నిర్వహించాలని, మరి కొందరు ఆలయ నిర్మాణానికి డబ్బు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టడంతో రైతుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో వేలం పాటలు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి డిపాజిట్ చెల్లించిన రైతులకు నగదును వెనక్కు ఇచ్చేశారు. తదుపరి తేదీని ప్రకటిస్తామని చెప్పి దేవదాయ శాఖ అధికారులు వెళ్లిపోయారు.

వంట చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి



మంటలు ఆర్పే విధానాన్ని చూపిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆత్మకూరు: గ్యాస్‌పై వంటలు చేసేటప్పుడు మహిళలు, యువత అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు అగ్నిమాపక కేంద్రం అధికారి బి.భీముడునాయక్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆర్టీసీ బస్టాండు వెనక ఉన్న బన్నూరు హౌస్‌లో అగ్ని ప్రమాదాల గురించి ప్రజకు అవగాహన కల్పించారు. మహిళలు వంట చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గ్యాస్ లీకేజీ జరిగినప్పుడు,లీకేజీ వల్ల మంటలు చెలరేగినప్పుడు ఏ జాగ్రత్తలు తీసుకోవాలో, ఎలా ఆర్పివేయాలో డెమో వేసి సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది మోహన్‌రాజు, జిలానీ, సుబ్బయ్య, రఫీక్, అన్సర్ పాల్గొన్నారు.

పైపులైన్ పనులను నిలిపివేయాలి



రాస్తారోకో చేస్తున్న వ్యాపారులు, ప్రజా సంఘాల నాయకులు

నందికొట్కూరు: పైపులైన్ పనులను నిలిపివేయాలని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్ డిమాండ్ చేశారు. పైపులైన్ పనులు నిలిపివేయాలని కోరుతూ వ్యాపారులు బుధవారం బంద్ పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి 56 కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవరాజ్ స్టీల్ ప్లాంటుకు, పారిశ్రామిక హబ్‌కు నీటిని తరలిస్తున్నారన్నారు. పట్టణంలోని పగిడ్యాల రోడ్డు బ్రహ్మంగారి మఠం నుంచి పాతబస్టాండ్, పటేల్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా మార్కెట్ యార్డు వరకు పైపులైన్ తీసుకెళ్లడం ద్వారా రోడ్డు ధ్వంసమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు నరసింహులు, రఘురామమూర్తి, నాగేశ్వరరావు, కర్ణ, ఫక్కీర్‌సాహెబ్, ఇస్మాయిల్, గోపాలకృష్ణ, ఉస్మాన్ బాషా, అబ్దుల్ రషీద్, రజిత, షాలుమియా, వ్యాపార దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



వడ్ల రామాపురంలో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు: మండలంలోని నల్లకాల్వ, కరివేన, వెంకటాపురం, వడ్ల రామాపురం గ్రామాల్లో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి బుధవారం సీసీ రోడ్లను ప్రారంభించారు. కరివేన గ్రామంలో రూ.2.20 కోట్లు, నల్లకాల్వలో రూ.35 లక్షలు, వెంకటాపురంలో రూ.45.50 లక్షలు, వడ్లరామాపురంలో రూ.35 లక్షలు చొప్పున సీసీ రోడ్లు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తిరుపాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న జిల్లా కార్యదర్శి నరసింహులు

నందికొట్కూరు: ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహులు కోరారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఈనెల 21న జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నా కార్యక్రమం కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తుత్తి హామీలతో అధికారం చేపట్టి 11 నెలల గడుస్తున్న ఒక్కటీ అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కూటమి ప్రభుత్వంపై చేపడుతున్న ఉద్యమాలకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అరుణ్‌కుమార్, గోపాల్, మజీద్‌మియా,క్రాంతికుమార్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

మృతి చెందిన వ్యక్తి తమ్మడపల్లె వాసేనా?

మహానంది: మహానంది సమీపంలోని అరటి పొలాల్లో నిప్పంటించుకుని మృతి చెందిన వ్యక్తి ఆచూకీ కోసం పోలీసులు ముమ్మరంగా విచారణ చేస్తున్నారు. ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది మంగళవారం అర్ధరాత్రి నుంచి మహానంది నుంచి నంద్యాల వెళ్లే మార్గంలో ఉన్న రెండు లాడ్జీల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి ఓ లాడ్జీ వద్ద ఆటోలో దిగినట్లు గుర్తించారు. అక్కడి నుంచి నడుచుకుంటూ అరటిపొలాల్లోకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. కాగా మహానంది మండలం తమ్మడపల్లె గ్రామంలో ఓ వ్యక్తి అదేరోజు నుంచి కనిపించడం లేదని పోలీసులకు సమాచారం అందగా గ్రామంలో వివరాలు సేకరించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కనిపించకపోవడంతో మృతి చెందిన వ్యక్తి అతనే అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. అయితే కనిపించని వ్యక్తి కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని, వివరాలు సేకరిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

విపత్తుల నిర్వహణపై వీఆర్‌ఓలకు శిక్షణ



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు

నంద్యాల(అర్బన్): పర్యావరణ విపత్తుల నిర్వహణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వీఆర్‌ఓలకు బుధవారం స్థానిక నిశాంత్ భవన్‌లో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నంద్యాల అర్బన్, రూరల్ తహసీల్దార్లు ప్రియదర్శిని, శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వరదలు, భూకంపాలు, అగ్నిప్రమాదాలు ముందస్తూ సమాచారం ఉంటే ఏ విధంగా సహాయ సహకారాలు అందించాలనే దానిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు మాట్లాడుతూ విపత్తులు జరిగినప్పుడు మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుగుణశ్రీ, డిప్యూటీ తహసీల్దార్లు రామ సంజీవరావు, రామచంద్రారావు, ఆర్‌ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఇంజిన్ చోరీ

కొలిమిగుండ్ల: నాగిశెట్టిపల్లె సమీపంలోని రైస్ మిల్‌లో ఉన్న ట్రాక్టర్ ఇంజిన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం చోరీ చేశారు. సంజామల మండలం పేరుసోములకు చెందిన సంధ్యాపాకుల దస్తగిరిమ్మకు చెందిన ట్రాక్టర్ ఇంజిన్‌ను రైస్‌మిల్ వద్ద ఉంచారు. గుర్తుతెలియని వ్యక్తులు ఎవరూ లేని సమయం చూసి గుట్టు చప్పుడు కాకుండా అపహరించారు. మిల్ వద్దకు వెళ్లి చూసే సరికి ఇంజిన్ కనిపించకుండా పోయింది. దీంతో కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది.

నాటుసారా విక్రేతల అరెస్ట్

డోన్ రూరల్: నాటుసారా అమ్ముతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. డోన్ నియోజకవర్గంలో నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో దాడులు నిర్వహించామని తెలిపారు. ప్యాపిలి మండలం కొలుపల్లి గ్రామానికి చెందిన వడ్డె నాగరాజు, బూరుగుల గ్రామానికి చెందిన గజ్జి చంద్ర మద్దిలేటి, అలేబాద్‌తండా గ్రామానికి చెందిన ముడావత్ శ్రీరాంనాయక్ ఆయా గ్రామాల్లో నాటుసారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసకున్నామని వెల్లడించారు. వీరి వద్ద నుంచి 170 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.